క్లుప్తంగా

నేడు 'ఉపాధి'పథకంపై సామాజిక తనిఖీ

బ్రహ్మంగారిమఠం : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో 11 గ్రామ పంచాయతీలలో చేపట్టిన పనులపై శనివారం ఉదయం 10గంటలకు ఉపాధి కార్యలయం సమీపంలో సామాజిక తనిఖీ సమావేశం ఉంటుందని ఏపీఓ వసంతకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమానికి ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం,రామగోవిందరెడ్డి, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు , ప్రజలు, అధికారులు హాజరవుతారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ జి.శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఇందుకు సహకరించాలని ఆయన కోరారు.

మైదుకూరు : మైదుకూరులో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ రామభద్రయ్య తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 5 గంటలపాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని తెలిపారు.

పోస్టర్ల విడుదల

ప్రొద్దుటూరు క్రైం : సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ ఆవిర్భావ సభ హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించనున్నారు. సభకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం సాయంత్రం పట్టణంలోని రచయితల సంఘం ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీనటుడు ప్రకాష్‌రాజ్‌తో పాటు పలువురు రచయితలు హాజరకానున్నట్లు ప్రొద్దుటూరు రచయితల సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రచయితలు మహమూద్, దాదాహయాత్, ఖలందర్‌తో పాటు తవ్వాసురేష్, వరలక్ష్మి, సృజన శ్రీను, హరిత, లక్ష్మీదేవి, పద్మ పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఓటర్ల పరిశీలన



నాగలకుంట్లలో విచారిస్తున్న తహసీల్దారు

పోరుమామిళ్ల : మండలంలోని సంచర్ల, అక్కలరెడ్డిపల్లె పంచాయతీల్లో ఓటర్ల జాబితాను శుక్రవారం తహసీల్దారు గంగయ్య బీఎల్‌ఓలతో కలసి ఇంటింటికీ తిరిగి ఓటర్ల గురించి వాకబు చేశారు. జాబితాలో ఉన్నవారు ఎవరైనా చనిపోయారా? వేరే ఊరికి వెళ్లి పోయారా? పేర్లలో తప్పులున్నాయా? రెండు సార్లు పేరు నమోదయిందా? కొత్తగా ఎవరైనా ఉన్నారా? తదితర సమాచారం గురించి బీఎల్‌ఓలను అప్రమత్తం చేశారు. ఓటర్ల విచారణలో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ విచారణలో స్థానిక వీఆర్‌ఓ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారికి పిండివంటలతో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అధిక శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా నిర్వహించిన మనసారె ... మనసారా కార్యాక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా 33 రకాల పిండి వంటలు, 33 రకాల నైవేద్యాలు అమ్మవారికి సమర్పించి 33 రకాల పుష్పాలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు సుబ్బరాజ, నాగభూషణం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కారు ఎవరిదో..



అట్లూరు : మండలంలోని సోమేశ్వరపురం సమీపంలో గుర్తు తెలియని కారును గురువారం రాత్రి స్థానికులు గుర్తించారు. కారులో నుంచి కొందరు వ్యక్తులు దిగి పొలాల వైపు వెళుతుండడం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వ్యవసాయ పొలాల్లో ఖరీదైన విద్యుత్ తీగలు, మోటర్లు, ట్రాన్స్ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయని, అటువంటి ముఠానే వచ్చి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై కేసిరాజు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పొలాల్లోకి వెళ్లిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఫలితం లేకపోవడంతో కారును అట్లూరు పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని ఎస్సై తెలిపారు.

రూ.4 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లలో రూ.4వేల కోట్లకుపైగా నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 93వేల గృహాలు ఉండగా 78వేల ఇళ్లకు సంక్షేమ పథకాలు అందాయని పేర్కొన్నారు. మనబడి నాడు–నేడు పథకం ద్వారా రూ.115 కోట్లు మంజూరు చేసి పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. ఇది చాలా గొప్ప కార్యక్రమమని తెలిపారు. నియోజకవర్గంలో శ్మశాన వాటికల కోసం స్థలం కేటాయించాల్సిన అవసరం ఉందని రెవెన్యూ అధికారులకు తెలిపారు. మనిషి జీవితంలో చివరి మజిలీ అయిన మరణం తర్వాత కూడా అంత్యక్రియల కోసం స్థలం చూపకుండా ఉంటే ఎలా అని అన్నారు. భగత్ సింగ్ కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరయ్యాయన్నారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు. ఈ ప్రభుత్వం పక్షపాత ధోరణి లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు బండికి జోడెద్దుల్లాంటి వారని, ఇందులో ఏ ఒక్క ఎద్దు సరిగా పనిచేయకపోయినా అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉండటం, లైన్లు వేలాడుతుండటం లాంటి సమస్యలు కనిపించకూడదని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో తరచూ విద్యుత్ కోతలు ఏర్పడుతున్నాయని మాజీ సర్పంచ్ పల్లా లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. ఈ సమస్య తాత్కాలికంగా ఉండేదని, ప్రస్తుతం పరిష్కారమైందని అధికారులు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈనెల 14న కలెక్టర్ సమక్షంలో నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఆయా శాఖల అధికారులు తనకు పూర్తి నివేదికను తయారు చేసి ఇవ్వాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, రాజుపాళెం జెడ్పీటీసీ అంజనీకుమారి, ప్రొద్దుటూరు ఎంపీపీ శేఖర్‌యాదవ్, రాజుపాళెం ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం తహసీల్దార్లు నజీర్ అహ్మద్, ఇందిరారాణి, ఎంపీడీఓలు రాంతులయ్య, సయ్యదున్నీసా, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



విద్యార్థులకు ఉచితంగా పద్మరాణీ మేరీ మహిళామండలి అందించిన సైకిళ్లు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పలుగురాళ్లపల్లె జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో చదువుతున్న గ్రామీణ విద్యార్థులు బస్సులు, ఆటోలు లేక ప్రతి రోజు 4నుంచి 10కిలోమీటర్లు నడిచి చదువుకుంటున్నారు. అటువంటి పిల్లల కష్టాలను గుర్తించిన కడపకు చెందిన పద్మరాణీ మేరీ మహిళామండలి డైరెక్టర్స్ స్టీఫెన్, జమున గార్లు శనివారం 36మంది బాలికలు , 5 మంది బాలురకు ఉచితంగా సైకిళ్లను అందించారు. ఈసందర్భంగా స్థానిక ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ పలుగురాళ్ళపల్లె ఉన్నత పాఠశాలకు విద్యార్థుల సంఖ్య ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో పెరిగిందన్నారు. విద్యార్థుల కష్టాలను గుర్తించిన పద్మరాణీ మేరీ మహిళామండలి సభ్యులు గుర్తించడం గొప్ప విషేశం అన్నారు. పాఠశాల్లో చదువుతున్న బాల బాలికలుకు సైకిల్‌లతోపాటు ప్యాడ్స్,పెన్నులు నోటుబుక్కులు ఉచితంగా ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు విద్యార్థుల తరుపున తెలుపుతున్నాను అన్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడదాం ఆంధ్రపై సమీక్ష

బి.కోడూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆడదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ ఆధ్వర్యంలో శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుండి ఆడదాం ఆంధ్రకు సంబంధించి ఆసక్తి కలిగిన విద్యార్థినీ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బాడ్మింటన్, కబడ్డీ ఆటలు ఉంటాయన్నారు. ఇందు కోసం గ్రామ, మండలస్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు అనంతరం ఎప్పటి నుండి క్రీడలు నిర్వహించాలనేది తదుపరి ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు చిన్నగురువళూరులో వైద్య శిబిరం

చాపాడు : ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్నగురువళూరు గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ కావ్య మాధురి తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద విలేజ్ క్లీనిక్ వద్ద ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు.

ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది



అమరవీరులకు నివాళి అర్పిస్తున్న అధికారులు

బద్వేలు అర్బన్ : ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా తపాలా కార్యాలయంలో రూ.25కే జాతీయ జెండాను విక్రయించనున్నట్లు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ డి.అహ్మద్‌హుస్సేన్ పేర్కొన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో తపాలా కార్యాలయంలో జాతీయ జెండాలను అందుబాటులో ఉంచామనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం పట్టణంలో పోస్టల్ సబ్ డివిజన్ సిబ్బంది జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్లు ధనమ్మ, సుబ్బరాయుడు, రఫి, నాగరాజులతో పాటు తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

త్యాగమూర్తులను గుర్తుంచుకోవాలి

మైదుకూరు : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించి త్యాగాలు చేసిన వారిని జీవితాంతం గుర్తుంచుకోవాలని ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని నంద్యాలంపేట, మిట్టమానుపల్లె, ఎస్.ఎర్రబల్లె, తువ్వపల్లె గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూఎంతోమంది దేశభక్తుల ప్రాణత్యాగం వల్ల స్వాతంత్ర్యం వచ్చిందని అన్నారు. ఆయా గ్రామాల్లో ప్రధానమంత్రి సూక్తితో పాటు అమరవీరులకు నివాళి అర్పిస్తూ ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించి జాతీయ జెండాను ఎగురవేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.థామస్, అటవీ అధికారులు శ్యాంసుందర్, జాకీర్, ఉపాధి హామీ పథకం ఏపీఓ లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆజాదికా అమృత్ మహోత్సవం

కాశినాయన : మండలంలోని ఉప్పలూరు, నరసాపురం, బాలాయపల్లె, మిద్దెల, ఆకులనారాయణపల్లె, కత్తెరగండ్ల గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఆజాదికా అమృత్ మహోత్సవంను ఘనంగా నిర్వహించినట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఏపీఓ రాజమౌళి, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఏఎస్ఐకి ఏఎస్పీ ప్రశంస



ఏఎస్ఐ సుబ్బన్నకు నగదు రివార్డు అందచేస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : ట్రాఫిక్ ఏఎస్ఐ సుబ్బన్నను ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ ప్రశంసించారు. ఆర్ట్స్‌కాలేజీ రోడ్డుకు చెందిన గోల్కొండ జాఫర్‌వలి గురువారం ఉదయం విద్యుత్ షాక్‌తో అపస్మారక స్థితిలో కింద పడిపోయిన విషయం తెలిసిందే. ఆయనను ట్రాఫిక్ ఏఎస్ఐ సుబ్బన్న ఆస్పత్రికి తరలించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. ధైర్య సాహసాలతో పాటు సమయ స్ఫూర్తితో వ్యవహరించి జాఫర్‌వలిని కాపాడిన ఏఎస్ఐని ఏఎస్పీ ప్రేరణాకుమార్ శుక్రవారం నగదు రివార్డుతో సత్కరించారు. స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రశంసాపత్రం కోసం కడప ఎస్పీకి సిఫార్సు చేయనున్నట్లు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ యుగంధర్ పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి ఓటర్ వివరాలను పరిశీలించాలి



చాపాడులో ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులపై అవగాహన కల్పిస్తున్న ఎలక్ట్రోరల్ అధికారి

చాపాడు : బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ వివరాలను పరిశీలించాలని నియోజకవర్గ ఎన్నికల ఎలక్ట్రోరల్ అధికారి నరసింహులు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో ఓటర్ల సవరణ, మార్పులు, చేర్పుల వంటి అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ.. అన్ని పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో జనవరి 1 నుంచి ఏప్రిల్ ఒకటి వరకూ, జూలై 1 నుంచి అక్టోబర్ 1 వరకూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓట్ల నమోదు, తొలగింపులో బీఎల్‌ఓ, బీఎల్‌ఏలు మాత్రమే పాల్గొనాలన్నారు. చాపాడు, మైదుకూరు తహసీల్దార్లు సుభానీ, అనురాధ, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు భూములు ఇవ్వాలి

ప్రొద్దుటూరు : అర్హులైన పేదలకు అసైన్‌మెంట్ భూములు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం మండలంలోని పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ అసైన్‌మెంట్ కమిటీలో ప్రతిపక్షాలను, ప్రజా సంఘాలను, ప్రజలను మమేకం చేయకుండా అధికార పార్టీ బినామీలకు అసైన్డ్ భూములు కట్టబెట్టే అవకాశం ఉందన్నారు. అర్హులైన పేదలకు అసైన్డ్ భూములను పంపిణీ చేయాలని ఈనెల 14న కడప కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నామనానారు. సమావేశంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి షరీఫ్, సభ్యులు హరి, శ్రీను, యేసోబ్, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి సందీప్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు



స్పూన్-నిమ్మకాయ పోటీల్లో మహిళలు

పోరుమామిళ్ల : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్వాక్రా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఏపీఓ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పరుగుపందెం, మ్యూజికల్ చైర్స్, సూదిలో దారం ఎక్కించడం, నిమ్మకాయ-స్పూన్ తదితర పోటీలు నిర్వహించారు. 6 క్లస్టర్లకు చెందిన డ్వాక్రా మహిళలు పోటీల్లో పాల్గొన్నారు.

13న చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలంకి శ్రీరాములు, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక దీప్తి జూనియర్ కాలేజిలో పోటీలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6, 7 తరగతి విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు లేదా స్వాతంత్ర్య సమర ఘట్టాల చిత్రాలు అనే అంశంపై చిత్రలేఖన పోటీలు ఉంటాయన్నారు. 8, 9, 10 తరగతి విద్యార్థులకు భారత దేశం – భిన్నత్వంలో ఏకత్వం అనే అంశంపై వ్యాసచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13న ఉదయం 9 గంటలకు స్థానిక జేవీవీ కార్యాలయంలో పోటీలు నిర్వహిస్తామని, సెల్ నంబర్ 9705432038కు ఫోన్ చేసి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ గౌరవ సలహాదారులు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీత, మాజీ అధ్యక్షుడు ప్రకాశ్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీలో నైపుణ్యం పెంచుకోవాలి

బద్వేలు అర్బన్ : చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీలో మహిళలు నైపుణ్యం పెంచుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎమ్మెల్యే, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ సుధ పేర్కొన్నారు. స్థానిక తెలుగుగంగ కాలనీలోని నిరాశ్రయుల వసతిగృహంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చిరుధాన్యాలతో బిస్కెట్లు తయారీపై మెప్మా మహిళలకు ఉచిత శిక్షణను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. చిరుధాన్యాలకు ఆదరణ పెరగడం, 2023 అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాలతో తయారయ్యే ఉత్పత్తులను తినేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని, ఈ నేపథ్యంలో మహిళలకు చిరుధాన్యాలతో బిస్కెట్ల తయారీపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం నిరాశ్రయుల వసతిగృహం ఏర్పాటుకు సహకరించిన మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార భాష సంఘం సభ్యులు డాక్టర్ తవ్వావెంకటయ్య, కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ నాయకులు యద్దారెడ్డి, ప్రతాప్‌కుమార్, రైజింగ్ సన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు

మైదుకూరు : పదో తరగతి పాసైన విద్యార్థులు మైదుకూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లు పొందవచ్చని కళాశాల ప్రత్యేక విధుల అధికారి, ప్రిన్సిపాల్ పి.గురుమూర్తి రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ పదో తరగతి పాసైన విద్యార్థులు పాలిసెట్ రాసినా, రాయకపోయినా మైదుకూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో చేరవచ్చని తెలిపారు. పాలిసెట్ అడ్మిషన్లపై పదో తేదీ నోటిఫికేషన్ వెలువడిందని, ఇప్పటికే విద్యార్థులు రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్‌ను పూర్తి చేసుకున్నారని పేర్కొన్నాను. శుక్రవారం నుంచి 14వ తేదీ వరకు విద్యార్థులు ఆప్షన్లను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. 16న ఆప్షన్ల మార్పు, 18న సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. 19 నుంచి 23వ తేదీ వరకు ఐదు రోజుల వ్యవధిలో విద్యార్థులు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేసుకోవాలన్నారు. 23వ తేదీ నుంచి అన్ని కళాశాలల్లో క్లాసులు ప్రారంభమవుతాయని వివరించారు. మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాలలో రసయాన శాస్త్రం, సివిల్ ఇంజనీరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, లోహ శాస్త్రం అనే ఆరు బ్రాంచ్‌లు ఉన్నాయని, ఒక్కో బ్రాంచ్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 360 సీట్లు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ వివరించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9347410521కు సంప్రదించాలని సూచించారు.

రేపు మెగా ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు శ్రీమత్ అహోబిళక్షేత్ర తొగటవీర క్షత్రియ సేవా సంఘం అన్న సత్రం అధ్యక్షుడు పల్లా శేషయ్య తెలిపారు. ఉచిత వైద్య శిబిరం కరపత్రాలను శుక్రవారం కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నసత్రం ఆధ్వర్యంలో మొదటి సారిగా నిర్వహిస్తున్న ఈ మెగా ఉచిత వైద్య శిబిరంలో కర్నూలు, కడప, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన 14 మంది ప్రముఖ డాక్టర్లు వైద్యసేవలు అందిస్తారన్నారు. తొగటవీర క్షత్రియ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ న్యూరాలజిస్ట్ డాక్టర్ చౌడం శ్రీనివాసులు, గుండెజబ్బుల నిపుణులు డాక్టర్ చింతా రాజ్‌కుమార్, యూరాలజిస్ట్ జి.రాజశేఖర్, డెర్మటాలజిస్ట్ గౌతమిలతో పాటు పలువురు వెన్నముక, కీళ్లనొప్పులు, డయాబెటిస్, మహిళలు, చిన్నపిల్లల వ్యాధుల వైద్య నిపుణులు సేవలు అందిస్తారన్నారు. వైద్య శిబిరానికి వచ్చేటప్పుడు తమ పాత రిపోర్ట్‌లను తీసుకురావాలన్నారు. వివరాలకు 9440245617, 7013756505 నంబర్లకు సంప్రదించాలన్నారు. తొగటవీర క్షత్రియ కల్యాణ మండప అధ్యక్షుడు బండారు రఘురామయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మట్టిమీద ప్రేముంటే దేశం మీద భక్తి ఉంటుంది



పోరుమామిళ్ల : మాజీ సైనికులకు సన్మానం



నాగిశెట్టిపల్లె గ్రామ సచివాలయం దగ్గర నామట్టి-నాదేశం పై ప్రతిజ్ఞచేస్తున్న సర్పంచ్‌లు



గోపవరంలో విశ్రాంత సైనికులను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు

పోరుమామిళ్ల : ప్రధాని నరేంద్రమోదీ పిలుపులో భాగంగా శుక్రవారం మండల కాంప్లెక్స్ ఆవరణలో 'మా భూమి-మా దేశం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా రంగసముద్రం సచివాలయంలో దేశ రక్షణలో సేవలందించిన మాజీ సైనికులను సన్మానించారు. సైనికోద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కెప్టెన్ రాముడు మాట్లాడుతూ మట్టిమీద ప్రేముంటే దేశం మీద భక్తి ఉంటుందని, ప్రతి ఒక్కరిలో దేశ భక్తి పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ బాషా పాల్గొని మాజీ సైనికులను సన్మానించారు.

పండుగలా 'నా మట్టి – నాదేశం'

బ్రహ్మంగారిమఠం : మట్టికి ప్రమాణాలు , వీరులకు వందనాలు, దేశంకోసం ప్రాణాలు అర్పించిన వీరులకు అంకితంచేస్తూ నిర్వహిస్తున్న 'నా మట్టి– నాదేశం ' కార్యక్రమ శుక్రవారం మండలంలో పండుగలా నిర్వహించారు. మండలంలో తోట్లపల్లె, దిరసవంచ, నాగిశెట్టిపల్లె, డి.నేలటూరు, గ్రామ పంచాయతీ సచివాలయాల్లో సర్పంచ్ ఆధ్వర్యంలో 'నా మట్టి – నాదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు వందనం, ప్రతిజ్ఞ, వీరజవానులకు సన్మానాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సచివాలయాలవద్ద మొక్కలు నాటారు. సర్పంచ్‌లు రాయపురెడ్డి లక్ష్మీదేవి, వాకుమల్ల అనంతరెడ్డి, అమీర్‌భాషా, మైదుకూరు మార్కెట్‌యార్డు డైరెక్టర్ భర్తమణ్యం శంకర్‌రెడ్డి, గ్రామ సచివాలయాల వ్యవసాయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విశ్రాంత సైనికులకు ఘన సత్కారం

గోపవరం : నా మట్టి – నా దేశం కార్యక్రమం ద్వారా విశ్రాంత సైనికులకు ఘన సత్కారం లభించింది. శుక్రవారం మండలంలోని గోపవరం, రాచాయపేట, టీ.సండ్రపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన నా మట్టి – నా దేశం కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. మండల ప్రత్యేకాధికారి నాగరాజ ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, ఈఓపీఆర్‌డీ హసీనా, డీడీఓ విజయకుమార్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ వెంకటలక్షుమ్మ, ఎంపీటీసీ సరస్వతి, అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



వెంకటయ్యనగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

దువ్వూరు : ప్రజల సమస్యల పరిష్కారం కోసంమే ×గడప గడపకు మన ప్రభుత్వం లక్ష్యమని₹ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండలంలోని నేలటూరు గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యేను ముస్లిం సోదరులు మసీదులోకి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. మసీదు అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరగా సంబంధిత అధికారులను పిలిపించి అందుకు సంబంధించిన అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు పేదలను పట్టించుకోలేదని, జగనన్న సుదీర్ఘ పాదయాత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సమస్యలను తెలుసుకున్నారన్నారు. సీఎం అయ్యాక వివిధ సంక్షేమ పథకాలను అమలు చేసి పేదవారికి సాయం చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ కృష్ణయ్య, మండల సచివాలయ కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, బొంతపల్లి వెంకటసుబ్బారెడ్డి, సంగన హరినాథరెడ్డి, చింతకుంట వీరారెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, ఓబుల కొండారెడ్డి, మంచాల రాజగోపాల్‌రెడ్డి, చిరాకి గౌస్, మిద్దె రసూల్ గౌస్, బాదుల్లా, రవిచంద్ర, తహసీల్దార్ రమకుమారి, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం కనిపిస్తోందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో గల వెంకటయ్యనగర్‌లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యం, మహిళల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు దేశంలో ఎక్కడా అమలులో లేని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. ఈ నాలుగేళ్ళ కాలంలో ఇప్పటికే ప్రతి కుటుంబానికి రూ.1.50 లక్షల నుండి రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరిందని, మరో ఏడాది పాలనలో మరింత లబ్ధి చేకూరనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు రాగిమానురవితేజ, చెవులవెంకటేశ్వర్లు, చెన్నయ్య, వార్డు ఇన్‌చార్జిలు ప్రతాప్‌కుమార్, అనిల్, చెన్నకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, మౌలాలి, షఫి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.